


## మహిళపై దాడి చేసిన హోంగార్డును సస్పెండ్ చేయాలి

-చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

-డాక్టర్ దిగ్గే బాబు

02




# సంగారెడ్డి మెదక్

ఆదివారం 20 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:10


# శక్తి పథకం (జీవో 97) రద్దుకు డిమాండ్



**మెదక్ (ప్రజా జ్యోతి)**

మొన్న అసెంబ్లీ సెషన్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి వివేక్ వెంకటస్వామి పాలిటెక్నిక్ విద్యాల గురించి మల్లొకసారి అసెంబ్లీలో మాట్లాడం చేత ఈ నిరసన కార్యక్రమాలు మల్ల ఉధృతంగా కొనసాగుతున్నాయి ఇందులో భాగంగా ఈరోజు మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి పథకానికి సంబంధించిన జీవో 97 ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మద్దతుగా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మిగతా 2 లో



# పూరి జగన్నాథుడి సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## - జన్మదినం సందర్భంగా పూరి జగన్నాథుడిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు - నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థన

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

తన జన్మదినాన్ని పురస్కరించుకొని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు శనివారం ఒడిశా రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరి శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకున్నారు. జగన్నాథ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ పురోహితులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. మిగతా 2 లో



# మహిళపై దాడి చేసిన హోంగార్డును సస్పెండ్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**
హఫీజ్‌పేట్‌లో మహిళపై దాడికి పాల్పడినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తున్న రైల్వే హోంగార్డును వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి హఫీజ్‌పేట్‌లో ఓ మహిళపై రైల్వే హోంగార్డు దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మహిళను కొట్టడంతో పాటు జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లిన ఘటన దారుణమని అన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన సిబ్బంది మహిళ అని చూడకుండా క్రూరంగా ప్రవర్తించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత హోంగార్డుపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర నాయకులు డాక్టర్ డి. ఓంప్రకాష్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఏ. ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.




# శక్తి పథకం (జీవో 97) రద్దుకు డిమాండ్

మొదటిపేజీ తరువాయి

ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొని విద్యార్థినుల పోరాటానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. పాల్గొన్న వారిలో
బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు
బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు
బీజేపీ పట్టణ అధ్యక్షుడు







ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూజీవో 97 వల్ల విద్యార్థులకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# పూరి జగన్నాథుడి సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రజల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ అండగా ఉండాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. జన్మదిన వేళ పూరి జగన్నాథుడి దర్శనం చేసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.



# త్వరలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ జిల్లా ప్రజలకు మరియు విద్యార్థులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ తీపి కబురు అందించారు. జిల్లాలో నూతనంగా కేంద్రీయ విద్యాలయాన్ని (కేవీ ) ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోంది. తాత్కాలిక భవనాల గుర్తింపు: పాఠశాలను ముందుగా తాత్కాలికంగా ప్రారంభించడానికి వీలుగా అనువైన భవన సముదాయాలను వెంటనే గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులతో సమీక్షా సమావేశం: శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ ప్రాజెక్ట్‌పై కీలక సమావేశం జరిగింది.కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ సంతోష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయెల్ అదనపు కలెక్టర్ నగేష్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య తదితర ముఖ్య అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రీయ విద్యాలయం శాశ్వత భవన నిర్మాణం కోసం ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించేందుకు చర్యలు వేగవంతం చేశారు. ఈ విద్యాలయం



అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన కేంద్ర ప్రభుత్వ ప్రామాణిక విద్య లభించనుంది. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత తాత్కాలికంగా నిర్వహిస్తున్న పాఠశాలను కొత్త భవనంలోనికి తరలించేలా తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశానికి ముందు మెదక్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలిక నిర్వహించేందుకు అనువయిన భవనాల అధికారులు పరిశీలించారు విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు ఇతర మౌలిక వసతులు



అందుబాటులోకి ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు కేంద్ర విద్యాలయం ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అవకాశాలు మరింత అందుబాటులో వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు గణాంక అధికారి నవీన్ విద్యాశాఖ సిబ్బంది సమీకృత కలెక్టర్ బృందం పాల్గొన్నారు.

# శివ్వంపేటలో ఘనంగా పోషణ మేళా

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 19:**

పోషణ మాసం సందర్భంగా శివ్వంపేట మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మేళా కార్యక్రమాలను నిర్వహించారు.మండల కేంద్రంలోని జెడ్‌పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషణ మేళాకు ఎంఈఓ బుచ్చా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంఈఓ పరిశీలించారు.వంటకాల తయారీ విధానం,వాటిలో ఉన్న పోషక విలువలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఎంఈఓ బుచ్చా నాయక్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో స్థానికంగా సులభంగా లభించే ఆకుకూరలు,కూరగాయలు,ఇతర పోషకాహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పిల్లలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చు



కోవాలని సూచించారు.జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి,ఇంట్లో తాజాగా తయారు చేసిన సమతుల్య పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు.పిల్లల శారీరక,మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంట్లో తీసుకునే ఆహారంతో పాటు పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో అందించే భోజనం విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.మండలంలోని వివిధ గ్రామాల్లోని



ప్రాథమిక,జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో కూడా పోషణ మాసం సందర్భంగా పోషణ మేళా కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది,తల్లిదండ్రులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ హెడ్మాస్టర్ బాలు,పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ సూపర్వైజర్ సంతోష,అంగన్వాడి టీచర్ వినీత,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనార్టీ సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం

**మెదక్ (ప్రజాజ్యోతి)**

శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తాసిల్దారులు మరియు మైనార్టీ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లాలో మైనార్టీలకు అమలవుతున్న పథకాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, షాదీ ఖానాల వంటి వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అమీద్ మాట్లాడుతూకల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్దిదారుల దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, ఎంక్వైరీ నిర్వహించి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు సాగాలన్నారు. జిల్లా పరిధిలోని మైనార్టీ విద్యాసంస్థలు మరియు వక్ఫ్ భూముల రక్షణకు సంబంధించిన అన్ని విషయాల్లో పురోగతి కనబడాలని స్పష్టం చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని మరియు అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు. నిరుద్యోగ మైనార్టీ యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు మరియు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాదీ ఖానాల నిర్మాణం విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మైనార్టీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ బాలయ్య, నర్సాపూర్ రామకృష్ణ మరియు సంబంధిత తాసిల్దార్లు పాల్గొన్నారు.



# కదంబ పత్రాలతో 16 గణపతి రూపాల విశేష అలంకరణ

## - శ్రీ చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులను ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ





**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 19:**

శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ పరిధిలోని శ్రీ చాకరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ ప్రభు శర్మ ఆధ్వర్యంలో వినాయకుడి 16 రూపాలను కదంబ పత్రాలపై ఉంచి, ఆంజనేయస్వామి చుట్టూ అందంగా అమర్చి అలంకరించారు. వివిధ రూపాల్లో ఉన్న గణపతి స్వరూపాలను కదంబ పత్రాలపై ఉంచి, వాటిని క్రమబద్ధంగా ఆంజనేయస్వామి చుట్టూ ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి సిద్ధమైన ఆకులతో చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు కొనసాగుతున్నాయి. గణపతి స్వరూపాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణను దర్శించుకుని స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కదంబ పత్రాలతో 16 గణపతి రూపాలను ఏర్పాటు చేయడం సంప్రదాయ భక్తి,ప్రకృతి పట్ల గౌరవానికి ప్రతీకగా నిలిచిందని భక్తులు పేర్కొన్నారు.

# పాంబండలో ఘనంగా శ్రీ సరస్వతి విగ్రహ 8వ వార్షికోత్సవం

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 19:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ గ్రామంలోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలల ఆవరణలో శ్రీ సరస్వతి విగ్రహ 8వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివ్వంపేట మండల విద్యాధికారి కే. బుచ్చానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లా డుతూ.. పాంబండ గ్రామంలో సుమారు తొమ్మిదేళ్ల క్రితం శ్రీ సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక,విద్యాభివృద్ధికి దోహదపడే ఆలోచన చేసిన లక్ష్మి మైసయ్య యాదవ్‌కు శ్రీ సరస్వతి అమ్మవారి ఆశీస్సులు,వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం విగ్రహ వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మైసయ్య యాదవ్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సందీప్,ఉపాధ్యాయులు సదానందం,చిన్న నాయక్, వేణుగోపాల్‌రెడ్డి,జగదీష్,విజయ్‌కుమార్,అంగన్‌వాడీ టీచర్ శ్యామల, పాఠశాల చైర్మన్ చింతకాడి మహేశ్వరి,గ్రామస్తులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ పట్నంలో ఘనంగా గణనాథుల పూజలు

## శనివారం వీకెండ్‌తో పోటెత్తిన భక్తజనం



**మెదక్ (ప్రజా జ్యోతి)**



మెదక్ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. వీకెండ్ కావడమే కాకుండా పవిత్రమైన శనివారం పర్వదినం కలిసిరావడంతో పట్టణంలోని వివిధ వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలు వెల్లువెత్తాయి. ఉదయం



నుంచే ప్రతి ఇల్లు, ప్రతి గల్లీ గణనాథుల నామస్మరణతో మారు మోగిపోయింది. ఈ సందర్భంగా స్థానిక భక్తులు కుటుంబసమేతంగా వచ్చి లంబోదరునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం నాటి విశిష్టతతో మండపాల వద్ద కుంకుమార్చనలు, తమలపాకులతో ఆకు పూజలు, పూల సమర్పణలు మరియు తమ తమ మొక్కుబడులకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి.

**పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా భక్తులు**



ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బొజ్జ గణపయ్యను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి, అగరబత్తులు వెలిగించి, రంగురంగుల సువాసనల పూలతో అర్చించి తమ నిండు మనస్సుతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఉత్సవ కమిటీల సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. పట్టణమంతా పండగ వాతావరణం నెలకొనడంతో మెదక్ ఆధ్యాత్మిక మురిపెంలో ఓలలాడుతోంది.

# హవేలీ ఘనపూర్, చిన్నశంకరంపేట్‌లో ఘనంగా టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ





**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ నియోజకవర్గంలోని హవేలీ ఘనపూర్ మరియు



చిన్నశంకరంపేట్ మండల కేంద్రాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలోని 'పాంచజన్యం' ప్రతిజ్ఞ పార్టీ ప్రకటించిన



'పాంచజన్యం' (ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయం) పథకాల ఐదు ప్రధాన లక్ష్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామని పార్టీ శ్రేణులు ప్రతిజ్ఞ చేశారు. పార్టీ బలోపేతం కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు మరియు సంస్థాగత బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు. చిన్నశంకరంపేట్ మండల కేంద్రంలో జెండా గద్దె నిర్మాణానికి సహకరించిన కేవల్ నందకిషోర్ గారికి పార్టీ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు ఇప్పా రమేశ్, టిఆర్ఎస్వి నాయకులు ఎండీ జునైద్, భాను, ప్రేమ్, మధు కార్తీక్, పిట్ల రాజశేఖర్, రాజుపేట నవీన్, ఇమ్రోజ్, రేహాన్, వైష్ణవ్ రాజ్, దినేశ్, గణేష్, అల్తాఫ్, మోయినుద్దీన్, శరన్, నాగాపూర్ నరేందర్, ఆటో యూనియన్ ప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుల నిమజ్జనం

**మెదక్ (ప్రజా జ్యోతి)**

పెద్ద శంకరంపేట కట్టెల వెంకటాపూర్ ఘనంగా గణనాథుల నిమజ్జనం గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొన సాగుతున్నాయి కావడమే కాకుండా పవిత్రమైన శనివారం పర్వదినం కలిసి రావడంతో గ్రామంలో వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వేలంపాటలో పెద్దింటి రాములు అరుణ్ వేలం పాటలో పాల్గొన్నారు.



## రెడ్డిపల్లి జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో పోషణ మేల

**నర్సాపూర్ 19 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

మండలంలోని జడ్పిహెచ్ఎస్ రెడ్డిపల్లి లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా శనివారం నాడు విద్యార్థులకు పోషణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మ అశోక్ హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన పోషణ స్టాల్‌ను పరిశీలించి, వాటి తయారీ మరియు పోషక విలువల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారు మరియు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మరియు సైన్స్ టీచర్ రాధిక మాట్లాడుతూ మన చుట్టుపక్కల, ఇంటి పరిసరాల్లో సులభంగా లభించే వివిధ రకాల ఆకుకూరలు,కూరగాయలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను నిత్యజీవితంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగగలరని సూచించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ కుమారి మాట్లాడుతూ, పిల్లలు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. బయట లభించే జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా, ఇంట్లో తాజాగా వండిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే సరైన ఎదుగుదల మరియు ఆరోగ్యానికి సమతుల్య పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక ప్రైమరీ మరియు జడ్పిహెచ్ఎస్ స్కూల్ లలో కూడా ఈ కార్యక్రమాన్ని చేయడం జరిగినదిఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది






# దౌల్తాబాద్, బోరపట్ల గ్రామాలలో నిమర్జనా చెర్వులను సందర్శన భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ప్రత్యూష్ పంకాజ్

**హత్నూర 19 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలోని దౌల్తాబాద్ బోరుపట్ల మరియు జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు శోభాయాత్ర మార్గాల్లో రోడ్ల పరిస్థితి, మరమ్మతులు,నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్,లైటింగ్,పారిశుధ్ధ్య ఏర్పాట్లపై సంభందిత అధికారులకు పలు సూచనలు తెలిపిన ఎస్పీ పారితోష్ పంకాజ్ ఐపిఎస్ సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక శోభా యాత్ర,నిమజ్జనాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు.ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్ల పై అధికారులతో సమీక్షించారు.నిమార్జనాలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన లైట్స్, క్రేన్లు, జగ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, చెర్వుల వద్ద బారికేడింగ్,భద్రతా లైటింగ్, పారిశుధ్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా



భక్తులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారి వెంబడి హత్నూర తాసిల్దార్ షేక్ పర్వీన్,జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణ రెడ్డి,వివిధ శాఖలకు చెందిన అధికారులు,సర్పంచులు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాయికోడ్‌లో 22న మండల సాధారణ సమీక్షా సమావేశం

**రాయికోడ్ సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):**

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మండల సాధారణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షరీఫ్ తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి,మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో),వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.మండలంలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.సమావేశానికి మండలంలోని మీడియా, పత్రికా ప్రతినిధులు హాజరై సమావేశ విశేషాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో కోరారు.

# యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం కోసం కృషి చేయాలి

**- యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ అంజుం బేగం**

**జహీరాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి న్యూస్)**

యూత్ కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం కోసం కృషి చేసి, యువతను పెద్ద ఎత్తున సంఘటితం చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ అంజుం బేగం పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పట్టణ కేంద్రం కు వచ్చిన సందర్భంగా నాయకులు ఘనంగా సన్మానం చేశారు. యూత్ కాంగ్రెస్ బలోపేతం పై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. యువతకు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాడిగి సర్పంచ్ హర్షద్ జామా పటేల్, యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు నాగిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బబ్లు నరేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ రవీందర్ చౌహన్, మాజీ జిల్లా జనరల్ సెక్రటరీ రాజు నాయకారూ, అసెంబ్లీ టౌన్ ప్రెసిడెంట్ ధర్మరాజ, అసెంబ్లీ సెక్రటరీ మోహన్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు

**- సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి,**






**జహీరాబాద్, సెప్టెంబర్ 19( ప్రజా జ్యోతి న్యూస్)**

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దాసరి బ్లెస్సి నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన అంశాల పై అవగాహన కల్పించారు. సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించి చక్కగా చదువుకోవాలని, పెద్దలను తోటివారిని గౌరవించాలని, చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకో వాలని అన్నారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించిన వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియ జేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉపాధ్యా యులు మనకు దిశా నిర్దేశకులని, వారిని గౌరవించడం మన విధి అని తెలియజేసారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం విద్యార్థులకు తెలియ జేసారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇస్మాయిలప్ప, దామోదర్ రెడ్డి, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# భూములు కోల్పోతున్న బాధితులు వివరాలు నమోదు చేసుకోవాలి

**-అర్హులైన వారికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం -ఆర్ఐ మాధవరెడ్డి**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

జాతీయ రహదారి 161బి నిర్మాణంలో భాగంగా భూములు, ఆస్తులు కోల్పోతున్న బాధితులు తమ వివరాలను నమోదు చేసుకుని నష్టపరిహారం పొందాలని నారాయణఖేడ్ ఆర్ఐ మాధవరెడ్డి సూచించారు.శనివారం నారాయణఖేడ్ పట్టణంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు, భూములు కోల్పోతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి బాధితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.బాధితులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ తదితర అవసరమైన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నష్టపరిహారానికి సంబంధించి సందేహాలుంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జీపీఓ సుధాకర్, జాతీయ రహదారి 161బి వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

## - మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

మహిళలు బ్యాంకుల ద్వారా అందించే వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి సూచించారు.నారాయణఖేడ్ మున్సిపాలిటీ మెప్మా విభాగం ఆధ్వర్యంలో శనివారం పట్టణ సమాఖ్యలో టీఎంసీ బి. అనిత ఆధ్వర్యంలో టీఎల్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వనరుల వ్యక్తులకు కొత్త సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణాలు, వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాల మంజూరు, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ వి. ప్రశాంతి మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్నచిన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.అలాగే పట్టణంలో కొత్తగా వీధి వ్యాపారులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారులు ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకం ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. లోక్ కళ్యాణ్ మేళా ద్వారా కొత్త వీధి వ్యాపారులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సమాఖ్య వనరుల వ్యక్తులు, కార్యవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చలో కొడంగల్ బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరణ

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ బాపు మల్‌శెట్టి ఆధ్వర్యంలో శనివారం ఆయన స్వగృహంలో 'చలో కొడంగల్' భారీ బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ.. చలో కొడంగల్ భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాణిక్యం ముదిరాజ్, ప్రశాంత్, మోహన్ నాయక్, నాగిరెడ్డి, సంగమేశ్వర చారి, గోవిందరావు, శివరాజ్, సంగమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం షూస్ పంపిణీ

**నర్సాపూర్ 19 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి)**



స్థానిక గ్రావీ వాఎ=×గ్గానూ (బాయ్స్) పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత స్కూల్ యూనిఫాంలు,షూస్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల సంక్షేమం,సౌకర్యార్థం ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి లక్ష్మీ రాజు యాదవ్, మండల విద్యాధికారి (వీజూ) శ్రీ తారాసింగ్, మరియు 2వ వార్డు కౌన్సిలర్ శ్రీ సుధీర్ గౌడ్ ,ప్రధానోపాధ్యాయులు సామ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ,ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెడమాస్టర్) ఎం.సామ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన విద్యా వాతావరణంతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.సకాలంలో యూనిఫాం,షూస్ అందడం పట్ల విద్యార్థులు,ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ (గ్రణ) బి.శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# వెదురు, ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అదనపు ఆదాయం

## - ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి:

## - జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :-**

రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి, తక్కువ నీటి వినియోగంతో మెరుగైన దిగుబడులు, అదనపు ఆదాయం పొందేలా పంటల మార్పిడిని ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు సూచించారు. కోహిర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో వెదురు సాగుపై అవగాహన సదస్సుతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారులు రైతులకు వెదురు, ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు, పంటల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

**వెదురు సాగుకు ప్రభుత్వ రాయితీలు**

జాతీయ వెదురు మిషన్‌లో భాగంగా ఈ ఏడాది పొలం గట్లపై వెదురు మొక్కలను సాగు చేసుకునే రైతులకు ఒక్కో మొక్కకు రూ.90 చొప్పున సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ఎకరానికి రూ.14,400 చొప్పున సబ్సిడీను ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు.రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు సూచించారు.

**ఆయిల్‌పామ్ సాగుకు 90 శాతం రాయితీ**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్‌పామ్ విస్తీర్ణ కార్యక్రమంలో భాగంగా రైతులకు 90 శాతం రాయితీతో ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటల సాగు, పంట నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని వివరించారు.రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో ఆయిల్‌పామ్ తోటలో కోకోవాను అంతర పంటగా సాగు చేస్తున్న విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో కోకోవాను అంతర పంటగా సాగు చేయడం ద్వారా భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుకు నీటి వసతి అత్యంత అవసరమని, ప్రతి మొక్కకు అవసరమైన మేరకు నీరు అందించేలా డ్రిప్ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.జిల్లాలో ప్రస్తుతం సుమారు 4,994 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు సుమారు రూ.24 వేల వరకు ఉందని పేర్కొంటూ, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై మరింత ఆసక్తి చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి కే. సునీత రోజ్, కేవీకే శాస్త్రవేత్త శైలజ, హెచ్ఓ సతీష్, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తల్లుల అనుభవాలే.. పిల్లల ఆరోగ్యానికి బలమైన పునాది

## పోషణ లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి

## అంగన్వాడి సూపర్వైజర్ అమృత వాణి



**అందోల్, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు సంపూర్ణ పోషణపై తల్లులకు అవగాహన కల్పించేందుకు అంగన్వాడి కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జోగిపేట అంగన్వాడి సూపర్వైజర్ అమృత వాణి తెలిపారు. పోషణ్ మాసం-2026లో భాగంగా శనివారం జోగిపేటలోని 9, 12వ అంగన్వాడి కేంద్రాల్లో తల్లులు, పిల్లలతో ఆరోగ్య అనుభవాల పంచుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత వాణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులు, పోషణ లోపం ఉన్న పిల్లల తల్లులు తమ అనుభవాలను పరస్పరం పంచుకునేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ఆహారపు అలవాట్లు, ఇంటి వద్ద పాటిస్తున్న మంచి పోషణ పద్ధతులను ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా ఇతర తల్లులకు అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సూచనలు, కౌన్సెలింగ్ అందించడంతో పాటు అవసరమైన వారిని ఆరోగ్య, పోషణ సేవలకు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. తల్లుల ద్వారా కుటుంబ స్థాయిలో నిరంతర సహకారం అందేలా చూడటం, పిల్లల ఆరోగ్య పరిస్థితిపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయడం కూడా కార్యక్రమంలో భాగమని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎం. శేఖమ్మ, కె. లలిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు అడ్డంకులెందుకు?

## - బంధం కొమ్ము చెరువు కట్టపై రోడ్డుకు అనుమతివ్వాలి

## - అధికారులు సమన్వయంతో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## లేకుంటే నీటిపారుదల శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తా

## -ఎంపీ రఘునందన్‌రావు








**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)** పటాన్‌చెరు నియోజకవర్గ ముఖద్వారమైన బీహెచ్ఈఎల్ కూడలి నుంచి బంధం కొమ్ము మీదుగా అమీన్‌పూర్ వరకు పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం సిఎంసీ, హెచ్ఎండీఏ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించి రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. బీహెచ్ఈఎల్ కూడలి నుంచి బంధం కొమ్ము మీదుగా అమీన్‌పూర్ వరకు రహదారి పనుల్లో పలు చోట్ల జాప్యం జరుగుతున్న నేపథ్యంలో స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎంపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బంధం కొమ్ము చెరువు కట్టపై రహదారి నిర్మాణానికి నీటిపారుదల శాఖ నుంచి అనుమతులు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని అధికారులు వివరించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ప్రజల రాకపోకలకు కీలకంగా ఉన్న రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదన్నారు.

### వెంటనే అనుమతులు మంజూరు చేయాలి

బంధం కొమ్ము చెరువు కట్టపై రోడ్డు నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. అనుమతుల విషయంలో ఇంకా జాప్యం చేస్తే నీటిపారుదల శాఖ రాష్ట్ర కార్యాలయం ముందు ధర్నా చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాఖల మధ్య సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని సూచించారు.

### కాలనీల్లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు

అమీన్‌పూర్‌లోని వినాయక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎంపీ పరిశీలించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కోరారు. అమీన్‌పూర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పెరుగుతున్న జనాభా, వాహన రాకపోకలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

### ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ పేర్కొన్నారు. సంబంధిత సిఎంసీ, హెచ్ఎండీఏ, నీటిపారుదల శాఖ అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని పెండింగ్ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యత అని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, నర్సింగ్ గౌడ్,ఈర్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ వృద్ధ మహిళకు ఆశ్రయం





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం సమీపంలో అనాథగా ఉన్న వృద్ధ మహిళకు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రయం కల్పించారు.పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం పక్కన గుర్తుతెలియని వ్యక్తులు సుమారు నాలుగు రోజుల క్రితం వృద్ధ మహిళను వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉండటంతో పరిసర ప్రాంతాల వారు మానవతా దృక్పథంతో ఆమెకు భోజనం అందిస్తూ వచ్చారు.

ఈ విషయాన్ని స్థానికులు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె, వృద్ధ మహిళకు సురక్షితమైన ఆశ్రయం కల్పించాలని జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ కు ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి తన సిబ్బందితో కలిసి వృద్ధ మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకుని ఆమెకు భోజనం అందించారు. అనంతరం అవసరమైన దుస్తులు అందించి, ఆమెను అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ వృద్ధుల ఆశ్రమానికి సురక్షితంగా తరలించి ఆశ్రయం కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, మహిళలు తదితరుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ఎవరైనా నిరాశ్రయులుగా కనిపిస్తే సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో వీణ, ప్రమీల, జబ్బర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వ్యక్తిత్వ వికాసం

- జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు
- మహాత్మా జ్యోతిరావు పూలే, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కార్యక్రమం





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నారాయణఖేడ్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విద్యాలయం, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు.జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుల్లపు మచ్చేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీహరి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సమయ నిర్వహణ, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం, లక్ష్య నిర్దేశం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ప్రేరణ కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విద్యతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం కూడా విద్యార్థుల విజయానికి కీలకమని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులనే లక్ష్యంతో నారాయణఖేడ్ యువతకు ఉపయోగపడే విద్యా, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు జీఎంఆర్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సదాశివపేటలో దారుణం వలస కార్మికుడి దారుణ హత్య

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదురుగా ఉన్న ఓ నివాస గృహంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కొందరు వలస కార్మికులు ఈ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కాగా, కార్మికుల మధ్య చిన్నపాటి వివాదం తలెత్తి గొడవకు దారితీసింది. మాటమాట పెరగడంతో తోటి కార్మికుడే తీవ్రంగా దాడి చేసి యువకుడిని దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.సంఘటన జరిగిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సదాశివపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.





# బీబీపేట పారిశుధ్యంపై డీఎల్పీవో పరిశీలన

**కల్హేర్, సెప్టెంబర్ 19:ప్రజా జ్యోతి,**

కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామంలో శనివారం డివిజన్ పంచాయతీ అధికారి (డీఎల్పీవో) సుధాకర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించడంతో పాటు వైకుంఠధామం, డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని ఆదేశించారు. వైకుంఠధామం, డంపింగ్ యార్డులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



# ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

## - ఈ నెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం

## -కమిషనర్ వి.ప్రశాంతి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం కింద దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి తెలిపారు. ఆమె ఒక ప్రకటనలో పేర్కొంటూ.. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పథకం కింద అర్హత కలిగిన బీసీ మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



# మల్కాపూర్ 4వ వార్డులో ఘనంగా గణనాథుని శోభాయాత్ర

## భజనలు, భక్తి గీతాలతో కన్నులపండువగా గణేశ్ నిమజ్జనం...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మల్కాపూర్ గ్రామంలోని 4వ వార్డులో గణనాథుని నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్డు మెంబర్ శ్వేత అనంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపులో వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భజనలు, భక్తి గీతాలు, జై గణేశ్ నినాదాలతో ఉత్సాహంగా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, యువత, చిన్నారులు సైతం భక్తిశ్రద్ధలతో పాల్గొని గణనాథునికి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా వార్డు మెంబర్ శ్వేత అనంతయ్య మాట్లాడుతూ.. గణనాథుని ఆశీస్సులతో 4వ వార్డు ప్రజలతో పాటు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు.



# కొండాపూర్ మండలంలో కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ సమావేశం

## సేవాదళ్ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



మండలంలో కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కరణం సందీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సేవాదళ్ నియమ నిబంధనలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మండల కార్యవర్గంతో కలిసి కరణం సందీప్ నాయకులు, కార్యకర్తలకు వివరించారు.అఖిల భారత సేవాదళ్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ నాయకత్వంలో సేవాదళ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కరణం సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశం ద్వారా మండల, జిల్లా సేవాదళ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు యం. పాండు, అమరేందర్ రెడ్డి, కార్యదర్శులు బోయిని భాస్కర్, రాములు, మల్లేష్, వీరేశం గౌడ్, శివరాం, సాయి కృష్ణ, అనిల్, గోపాల్, బి. ప్రశాంత్, నాగరాజ్‌తో పాటు మండల కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన జిల్లా, మండల ముఖ్య నాయకులను సేవాదళ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల ప్రాథమిక చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

## - హైస్కూల్ విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**కల్హేర్:19.సెప్టెంబర్. ప్రజా జ్యోతి**

కల్హేర్ మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హైస్కూల్ విద్యార్థులకు కనీసం తమ పేరు, తల్లిదండ్రుల పేర్లు సైతం సరిగా రాయలేని పరిస్థితి ఉన్నట్లు తల్లిదండ్రుల సమావేశంలో వెల్లడైంది. విద్యార్థుల ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పాఠశాలలతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సమావేశంలో సూచించారు.విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడంతో పాటు ఇంటి వద్ద వారు క్రమం తప్పకుండా చదువుతున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు




పాఠశాలలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని నిపుణులు పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తుకు పునాది అయిన ప్రాథమిక విద్యపై నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా పి. చంద్రశేఖర్ రెడ్డి

**కల్హేర్, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా పి. చంద్రశేఖర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం అధికారికంగా నియామకాన్ని ప్రకటించింది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచడం, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంలో నూతన డీసీసీ అధ్యక్షుడి పాత్ర కీలకంగా ఉండనుంది. పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.పి. చంద్రశేఖర్ రెడ్డి నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



ALL INDIA CONGRESS COMMITTEE

September 19, 2026

PRESS RELEASE

...ble Congress President has approved the proposal for the appointment of the Presidents of the following District Congress Committees in Telangana, under Sangathan Srijan Abhiyan, with immediate effect.

1. Ramagundam Corporation - Shri MD. Mustafa
2. Ranga Reddy - Smt. Chigiritha Parijatha
3. Sanga Reddy - Shri Patolla Chandrasekhar Reddy

(K. C. Venugopal)

